అలరించిన నృత్యార్చన



మాదాపూర్‌: కళాకారులు కూచిపూడి నృత్యప్రదర్శనతో సందర్శకులను అలరించారు. మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో నిర్వహించే అన్నమా స్వరార్చన కార్యక్రమంలో భాగంగా శనివారం నృత్యార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. కళారాధన మ్యూజిక్‌, డ్యాన్స్‌ అకాడమీ గురువు తాళ్లపాక సందీప్‌ కుమార్‌, తాళ్లపాక శైలజ శిష్య బృందంచే కూచిపూడి నృత్య ప్రదర్శనను ప్రదర్శించి అలరించారు. ఇందులో మీనాక్షి పంచరత్నం, గురుస్తుతి, గురుఅష్టకం, చిదంబరస్తోత్రం, చక్కని తల్లి, అదివో అల్లదివో, లలిత హారతి తదితర అంశాలను కళాకారులు తరంగిణి, యశశ్రీ, శ్రీవల్లి, చైత్ర, రిశిత, గగన, గమ్య, ఆద్యరెడ్డి, ఇషాప్రియల్‌, శ్రీనిక, దిప్తిశ్రీ, శరణ్య, రూషిత, అక్షయ, సాహితి తదుతరులు పాల్గొని ప్రదర్శించారు. అనంతరం సంస్థ వ్యవస్థాపకులు శోభరాజు, మేనేజింగ్‌ ట్రస్టీ నందకుమార్‌ కళాకారులను అభినందించి జ్ఞాపికలను అందజేశారు.

సైబర్‌ సెక్యూరిటీ రంగానిదే భవిష్యత్‌



బ్రోచర్‌ను విడుదల చేస్తున్న రమణభూపతి తదితరులు

మాదాపూర్‌: భవిష్యత్తు అంతా సైబర్‌ సెక్యూరిటీ రంగానిదే అని క్వాలిటీ థాట్‌ వ్యవస్థాపకుడు రమణభూపతి అన్నారు. మాదాపూర్‌లోని అయ్యప్పసొసైటీ క్వాలిటీ థాట్‌ కార్పొరేట్‌ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్వాలిటీ థాట్‌ సాఫ్ట్‌వేర్‌ ట్రైనింగ్‌ ఇనిస్టిట్యూట్‌లు నవంబర్‌ 24న ఉదయం 11 గంటలకు సైబర్‌ సెక్యూరిటీ ఉచిత స్కాలర్‌షిప్‌ పరీక్షను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పరీక్ష భారతదేశంలోని విద్యార్థులకు ఏకకాలంలో ఆన్‌లైన్‌, ఆఫ్‌లైన్‌లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారురు. మొదటి 100, టాప్‌ 20 మెరిట్‌ విద్యార్థులు మిగిలిన అభ్యర్థులకు మెరిట్‌స్కోర్ల ఆధారంగా పూర్తి 100 శాతం స్కాలర్‌షిప్‌ను అందుకుంటారు. ఆరు నెలల శిక్షణ ఉంటుందన్నారు. మూడు నెలల ఇంటెన్సివ్‌ శిక్షణతో పాటు మూడు నెలల ఇంటర్న్‌షిప్‌ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో క్వాలిటీ థాట్‌ చీఫ్‌ ఇన్ఫర్మేషన్‌ సెక్యూరిటీ ఆఫీసర్‌ రాజేంద్ర బొడ్డా తదితరులు పాల్గొన్నారు.

బాక్స్‌టైప్‌ డ్రైన్‌ నిర్మాణ పనులను అడ్డుకున్న స్థానికులు



జీహెచ్‌ఎంసీ ఏఈ భాస్కర్‌తో వాగ్వాదానికి దిగిన స్థానికులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లిలో బాక్స్‌టైప్‌ డ్రైన్‌ నిర్మాణ పనులను స్థానికులు శనివారం అడ్డుకున్నారు. లింగంపల్లి రైల్వే అండర్‌ బ్రిడ్జి వద్ద పొంగిన వరద నీరు వెళ్లేందుకు జీహెచ్‌ఎంసీ అధికారులు బాక్స్‌టైప్‌ డ్రైన్‌ నిర్మాణం కోసం పనులు చేసేందుకు వచ్చారు. స్థానికంగా ఉన్న అపార్టుమెంట్‌ వాసులు వ్యతిరేకించి, అధికారులతో వాగ్వాదానికి దిగారు. అపార్టుమెంట్ల కింది భాగం నుంచి ఉన్న డ్రైన్‌ నుంచి వరద సాఫీగా వెళ్లేందుకే పనులు చేస్తున్నామని సర్కిల్‌ ఏఈ భాస్కర్‌ పేర్కొనగా, డ్రైన్‌ పనులు రోడ్డు నుంచి ఉండగా ఎందుకు మార్చాల్సి వచ్చిందని ప్రశ్నించారు. అపార్టుమెంట్‌ నిర్మాణం పూర్తి అయిన తర్వాత జీహెచ్‌ఎంసీ ఓసీ కూడా జారీ చేసిన తరువాత ఎందుకు వస్తున్నారని నిలదీశారు. ఈ విషయాన్ని కార్పొరేటర్‌ రాగం నాగేందర్‌యాదవ్‌ దృష్టికి స్థానికులు తీసుకురాగా ఎవరికి ఇబ్బంది లేకుండా పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు స్థానికులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి విలేజ్‌ డెవలప్‌మెంట్‌ కమిటీ సలహాదారులు దేవులపల్లి శ్రీనివాస్‌, వర్క్‌ ఇన్‌స్పెక్టర్‌ మహేష్‌ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

ఎంపీ రఘునందన్‌రావు



అసంపూర్తిగా ఉన్న సర్వీస్‌రోడ్డును పరిశీలిస్తున్న ఎంపీ రఘునందన్‌రావు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రజా సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని మెదక్‌ పార్లమెంట్‌ సభ్యుడు రఘునందన్‌రావు పేర్కొన్నారు. శనివారం సాయంత్రం తెల్లాపూర్‌ మున్సిపాలిటీ పరిధిలోని ఈదులనాగులపల్లి గ్రామంలో రేడియల్‌ రోడ్డును ఆనుకుని అసంపూర్తిగా ఉన్న సర్వీస్‌రోడ్డును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...సర్వీస్‌ రోడ్డు అసంపూర్తిగా ఉండటంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమస్యను తన దృష్టికి తీసుకునిరావడంతో ఇక్కడికి వచ్చానని చెప్పారు. సంబంధిత అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుని ఈ సమస్యను పరిష్కరిస్తానని హామీనిచ్చారు. అదేవిధంగా రైల్వే అండర్‌ బ్రిడ్జ్‌ పనులు త్వరగా పూర్తి చేసేలా అధికారులతో మాట్లాడతానన్నారు. కార్యక్రమంలో నాయకులు రాముగౌడ్‌ పాల్గొన్నారు.

అభివృద్ధికి నిధులు కేటాయించండి



పటాన్‌చెరు: నియోజకవర్గ పరిధిలోని భారతీనగర్‌, రామచంద్రపురం, పటాన్‌చెరు డివిజన్‌ పరిధిలో జలమండలి ఆధ్వర్యంలో చేపట్టనున్న అభివృద్ధి పనులకు రూ.13 కోట్ల 20 లక్షల నిధులు కేటాయించాలని ఆ శాఖ ఎండీ అశోక్‌రెడ్డిని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌ రెడ్డి విజ్ఞప్తి చేశారు. శనివారం హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డివిజన్‌లో పరిధిలో చేపడుతున్న పలు అభివృద్ధి పనులపై చర్చించారు. బల్దియా పరిధిలో నూతనంగా ఏర్పాటు అవుతున్న కాలనీలతో పాటు, పాత కాలనీల్లో అంతర్గత మురుగునీటి కాల్వలు , సీసీ రోడ్ల పనులు చేపట్టేందుకు ప్రణాళికల సిద్ధం చేసినట్లు చెప్పారు. అందుకు అనుగుణంగా నిధులు కేటాయించాలని కోరారు. వీటితో పాటు గతంలో జలమండలికి కేటాయించిన ఆర్‌హెచ్‌సీ ప్రాంతంలో ఆస్పత్రిలో సేవలు లేనందున స్థానిక అవసరాల కోసం జీహెచ్‌ఎంసీకి కేటాయించాలని విన్నవించారు. అందుకు సానుకూలంగా స్పందించిన ఎండీ అశోక్‌రెడ్డి త్వరలోనే నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు.

మురుగు సమస్యను పరిష్కరించండి సారూ..?

నాలుగు నెలలుగా విశ్వేశ్వరయ్య కాలనీలో మురుగు ప్రవాహం

- ఇబ్బందులు ఎదుర్కొంటున్న కాలనీవాసులు
- పట్టించుకోని ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు



విశ్వేశ్వరయ్య కాలనీలో ప్రవహిస్తున్న మురుగు

మియాపూర్‌: ప్రధాన రహదారుల్లో నాలుగు నెలలుగా మురుగు నీరు మ్యాన్‌హోళ్ల నుంచి ప్రవహిస్తున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యారు. పైప్‌లైన్‌లో చెత్తాచెదారం ఎప్పటికప్పుడు తొలగించకపోవడంతో పాటు మరికొన్ని చోట్ల సామర్థ్యానికి సరిపడే పెద్ద పైప్‌లైన్‌లు లేకపోవడంతో మురుగు సాఫీగా ప్రవహించక మురుగు సమస్య తలెత్తుతుంది. రోజుల తరబడి మురుగు సమస్యకు పరిష్కారం చూపకపోవడంతో స్థానికులు దుర్వాసన భరించలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



- చందానగర్‌ డివిజన్‌ పరిధిలోని విశ్వేశ్వరయ్య కాలనీ ప్రధాన రోడ్డు పక్కన నాలుగు నెలలుగా మురుగు ప్రవహిస్తుంది. మారుమూల గ్రామాల్లో ఓపెన్‌ మురుగు కాల్వలను తలపిస్తుంది.
- మియాపూర్‌ పోలీస్‌స్టేషన్‌ వెనుకాల ఉన్న ఆలయం, పోలీస్‌ సిబ్బంది విశ్రాంత గది ముందు నుంచి మురుగు ప్రవహిస్తుంది. ఆలయానికి వచ్చిన భక్తులు, విశ్రాంతి గదికి వెళ్లే పోలీస్‌ సిబ్బంది మురుగునీటిలో నుంచే రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దుర్గంధపు వాసన భరించలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మురుగు ఓపెన్‌గా ప్రవహించడంతో దోమలు వృద్ధి చెంది రోగాల బారిన పడుతున్నారు.
- గత నాలుగు నెలల క్రితం మ్యాన్‌హోళ్ల పొంగి మురుగు ప్రవహిస్తుందని, స్థానికులు అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేయగా పరిశీలించి వెళ్లారు. ఆ తర్వాత సిబ్బంది వచ్చి ఒక మ్యాన్‌హోల్‌ నుంచి మరో మ్యాన్‌హోల్‌కు మధ్యలో రోడ్డు పక్కన కాల్వ మాదిరి గుంతను తవ్వి అందులో నుంచి మురుగు ప్రవహించేలా ఏర్పాటు చేశారు. ఇది చిన్న ఓపెన్‌ నాలాను తలపిస్తుంది. కొత్త పైప్‌లైన్‌ ఏర్పాటు చేయకుండా ఇలా ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారని స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
- సీవరేజ్‌ ఓవర్‌ ఫ్లో ఫ్రీ సిటీ, భూగర్భ జలాలు పెంచడమే లక్ష్యంగా జలమండలి చేపట్టిన 90 కార్యాచరణ కార్యక్రమం ఎక్కడ అమలు కావడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్టోబర్‌ మొదటి వారంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో మొదటగా ఎక్కువగా అధిక మురుగు ఉన్న చోట సమస్యను పరిష్కరించాల్సి ఉంది. కానీ ఈ కార్యక్రమం ఎక్కడ కనిపించడం లేదంటూ స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
- జలమండలి ప్రారంభించిన 90 రోజులు కార్యక్రమం చేపట్టి నెలరోజులకు పైగా గడుస్తున్న కాలనీ, బస్తీలలో మురుగు సమస్య పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత నాలుగు నెలలుగా ప్రవహిస్తుందని, ఓపెన్‌ నాలాను తలపిస్తుంది. ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
- ఉన్నతాధికారులు స్పందించి నూతన పైప్‌లైన్‌ ఏర్పాటు చేసి మురుగు సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

అజయ్‌కుమార్‌కు శ్రీనివాసరాయప్రోల్‌ కవితా బహుమతి



రాయదుర్గం: కవి అజయ్‌ కుమార్‌కు శ్రీనివాసరాయప్రోల్‌ కవితా బహుమతి-2024 వరించింది. అజయ్‌కుమార్‌ 23 ఏళ్ల ఆంగ్ల సాహిత్య విద్యార్థి. జ్యూరీని ఏర్పాటు చేసిన ముంబైకి చెందిన కవి మెంకా శివదాసాని, హెచ్‌సీయూలోని ఆంగ్ల విభాగానికి చెందిన ఇద్దరు అధ్యాపకులు ఈ విజేతను ఎంపిక చేశారు. మొత్తం 66 మంది పోటీదారుల నుంచి అజయ్‌ కుమార్‌ను ఎంపిక చేశారు. అజయ్‌కుమార్‌ చెన్నైకి చెందిన కవి, ఈ-చాప్‌బుక్‌, 'బ్యాలెన్సింగ్‌ యాక్ట్‌ (యవనికాప్రైస్‌-2023) రచయిత, ది బాంబే లిటరరీ మ్యాగజైన్‌, రాటిల్‌, ది బాంబే రివ్యూ, ఉసావా, ఏఎస్‌పీ ఆర్ట్‌లో తన కవితలను ప్రచురించారు.

ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి

కేపీహెచ్‌బీకాలనీ: రోడ్డు దాటుతున్న ఓ వ్యక్తిని వేగంగా దూసుకువచ్చిన బుల్లెట్‌ వాహనం ఢీకొట్టడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో శనివారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. కేపీహెచ్‌బీ కాలనీ ఏడవ ఫేజ్‌, ఎల్‌ఐజీ గృహాల్లో నివాసం ఉండే నరసింహ మూర్తి (60) తెల్లవారుజామున టీ తాగే అలవాటు ఉంది. దీంతో శనివారం ఉదయం ఫోర్త్‌ ఫేజ్‌ వైపు వెళ్లేందుకు ఫ్లై ఓవర్‌ వద్ద రోడ్డు దాటుతున్నాడు. ఈ క్రమంలో హైటెక్‌ సిటీ వైపు వెళ్తున్న సురేందర్‌ బుల్లెట్‌ వాహనంతో ఫ్లై ఓవర్‌ వద్ద రోడ్డు దాటుతున్న నరసింహమూర్తిని ఢీకొట్టాడు. దీంతో తీవ్రగాయాలై అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆకట్టుకున్న అసోం జానపద నృత్యాలు





సంప్రదాయ దుస్తులతో ఆకట్టుకున్న కళాకారులు, అసోం జానపద నృత్యాలు

మాదాపూర్‌: అసోం జానపద నృత్యాలతో కళాకారులు సందర్శకులను ఆకట్టుకున్నారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో శనివారం హైదరాబాద్‌ అసోం అసోసియేషన్‌ ఆధ్వర్యంలో లూయిట్పోరియా ప్రముఖ దివంగత గాయకులు భూపెన్‌ హజారికాకి అస్సాం వాసులు శ్రద్ధాంజలి ఘటించారు. అందులో భాగంగా భూపెన్‌ హజారికా రచించిన, పాడిన పాటలను ఆలపించి అలరించారు. కళాకారులు అసోం సాంప్రదాయ దుస్తులు ధరించి ప్రదర్శనలు చేశారు.

స్ఫటిక లింగానికి అభిషేకం



స్ఫటిక లింగానికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

రాయదుర్గం: కార్తీక మాస అభిషేక కార్యక్రమంలో భాగంగా శనివారం టెలికామ్‌నగర్‌లోని సాయిదత్త గణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో కార్తీక మాసం నెలరోజుల పాటు ప్రతియేటా స్ఫటిక లింగానికి అభిషేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు డి.రవీందర్‌రెడ్డి, డి.నరేందర్‌రెడ్డి పర్యవేక్షణలో తూర్పు గోదావరి ఆలమూరుకు చెందిన బ్రహ్మశ్రీ శైవాగమ వాచస్పతి కాశ్లకూరి సూర్యశ్రీ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు వీవీవీఎస్‌ శర్మ, వీ. నాగవికాస్‌ భక్తుల సమక్షంలో అభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకుముందు ఆలయంలో షిర్డీ సాయిబాబా, గణపతి, దత్తాత్రేయస్వామికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు, అలంకారం చేశారు.

15న సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు..

కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని టెలికామ్‌నగర్‌లోని సాయిదత్తగణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం 10 గంటలకు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం కార్యక్రమాన్ని నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనాలనుకున్న భక్తులు ఆలయంలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని వారు కోరారు.

క్యాంటీన్ల నిర్వాహకులకు ముగిసిన శిక్షణ



సర్టిఫికెట్లు పొందిన వారితో అధికారులు

రాయదుర్గం: ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ల నిర్వహణలో మహిళలు కీలకపాత్ర పోషించాలని సొసైటీ ఫర్‌ ఎలిమినేషన్‌ ఆఫ్‌ రూరల్‌ పావర్టీ(సెర్ప్‌) డైరెక్టర్‌ డబ్ల్యూ జాన్సన్‌ వెల్లడించారు. గచ్చిబౌలిలోని 'నిథమ్‌'లో ఇందిరా మహిళాశక్తి క్యాంటీన్ల నిర్వాహకులుగా ఎంపికైన వారికి మూడవ విడత శిక్షణ కార్యక్రమం తర్వాత వారికి సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. మహిళలకు సాధికారత కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం పెట్టుకుందని ఆయన పేర్కొన్నారు. ఈ విడతలో 30 మందికి శిక్షణ అందించడం, క్యాంటీన్‌ నిర్వహణలో వివిధ రకాల తయారీలపై ఆచరణాత్మక శిక్షణ ఇప్పించడం జరిగిందన్నారు. సెర్ప్‌ సీఈఓ డీ.దివ్య, డైరెక్టర్‌ గోపాలరావు, నాగరాజరావు, నిథమ్‌ ఇన్‌చార్జి ప్రిన్సిపల్‌ చెఫ్‌ గణేష్‌, శిక్షణ కోఆర్డినేటర్‌ మిషెల్లి జే ఫ్రాన్సిస్‌, ఫ్యాకల్టీ విజయలక్ష్మీ, శిరీషామూర్తి, డాక్టర్‌ కిరణ్మయి, మహేశ్వర్‌ రెడ్డి, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కు అందజేత

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి డివిజన్‌ పరిధిలోని ప్రగతినగర్‌ కాలనీకి చెందిన వినోద్‌ కుమార్‌కు రూ.60 వేల సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కు మంజూరైంది. ఆ చెక్కును పీఏసీ చైర్మన్‌, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి సహాయనిధి పేద ప్రజలకు గొప్ప వరమన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌, తిరుపతిరావు, విజయ్‌ కుమార్‌, ప్రేమ్‌కుమార్‌, రాము, ముత్తయ్య, ప్రభాకర్‌రెడ్డి, మోహన్‌, సారయ్య పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వే



శాంతినగర్‌లో కుటుంబ సభ్యుల వివరాల సేకరిస్తున్న తీరును పరిశీలిస్తున్న డీసీ

చందానగర్‌: కుటుంబ సర్వేలో తప్పులు లేకుండా ఎన్యుమరేటర్లు జాగ్రత్తగా నమోదు చేయాలని, ప్రతి ఎన్యుమరేటర్‌ రోజుకు 15 కుటుంబాల సభ్యుల వివరాలను సేకరించాలని చందానగర్‌ సర్కిల్‌-21 ఉప కమిషనర్‌ మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం చందానగర్‌ సర్కిల్‌లోని శాంతినగర్‌లో గుర్తించిన ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యుల వివరాల సేకరిస్తున్న తీరును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వివరాలు జాగ్రత్తగా మార్గదర్శక పుస్తకంలో సూచించిన ప్రకారం పొరపాట్లు లేకుండా నమోదు చేయాలన్నారు. ప్రతిరోజూ సంబంధిత సూపర్‌వైజర్లు ఎన్యుమరేటర్ల నమోదును క్షేత్ర స్థాయిలో తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. మొదటి విడత పూర్తి అయిన నేపథ్యంలో రెండవ విడతలో భాగంగా ప్రజలందరూ తమ ఇంటికి వచ్చిన ఎన్యుమరేటర్లకు, సూపర్‌వైజర్లకు సహకరించాలన్నారు. ఈ పరిశీలనలో ప్రాజెక్టు అధికారి ఉషారాణి తదితరులు ఉన్నారు.

సర్వేకు ప్రజలంతా సహకరించాలి..

రాయదుర్గం: సమగ్ర సర్వేకు ప్రజలంతా సహకరించాలని గచ్చిబౌలి కార్పొరేటర్‌ గంగాధర్‌రెడ్డి పేర్కొన్నారు. గోపన్‌పల్లిలో జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి ఇంటింటికీ స్టిక్కరింగ్‌ వేసే కార్యక్రమాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..ఈ అవకాశాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సర్వే ఫారమ్‌లో అన్ని వివరాలను సక్రమంగా పూరించి అధికారులకు అందజేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి సర్కిల్‌ సర్వే అధికారి, కమిషనర్‌ ప్రేమ్‌కుమార్‌, ట్యాక్స్‌ ఇన్‌స్పెక్టర్‌ మురళీకృష్ణ, దీపక్‌ తదితరులు పాల్గొన్నారు.

శేరిలింగంపల్లి సర్కిల్‌ పరిధిలో..

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్‌ పరిధిలో సమగ్ర కుటుంబ సర్వే కార్యక్రమం కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో ఎన్యుమరేటర్లు బ్లాక్‌ల వారీగా ఇంటింటిని గుర్తించి వాటికి స్టిక్కర్లను శనివారం వేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్‌ ముకుంద్‌రెడ్డి మాట్లాడుతూ..ఇప్పటికే ఎన్యుమరేటర్లు ఇంటింటికి వెళ్లి వారిని గుర్తించి, వాటికి స్టిక్కర్లను అంటించే కార్యక్రమం 94 శాతం పూర్తి అయిందన్నారు. కుటుంబ వివరాలను నమోదు చేసే కార్యక్రమం ఉన్నతాధికారుల ఆదేశానుసారం చేపడుతామన్నారు. సర్వేకు ప్రజలు సహకరించాలని కోరారు.



గోపన్‌పల్లిలో స్టిక్కరింగ్‌ కార్యక్రమంలో కార్పొరేటర్‌ గంగాధర్‌రెడ్డి



డోయన్స్‌ కాలనీలో ఇంటింటికీ స్టిక్కర్లను అంటిస్తున్న సిబ్బంది

సందడిగా కార్తీక వనభోజనాలు



శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి డివిజన్‌ ఆరంభ్‌ టౌన్‌షిప్‌లో కార్తీక వనభోజనాల కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. టౌన్‌షిప్‌ వాసులు ఉసిరి, తులసి చెట్లకు పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు చేసిన వంటకాలతో సామూహికంగా భోజనాలు చేశారు. అనంతరం నిర్వహించిన క్రీడా పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆరంభ్‌ టౌన్‌షిప్‌ వాసులు విజయలక్ష్మి, సత్యవాణి, త్రివేణి, సత్య, నీలిమా, పూజ, శేషారత్నం, ప్రశాంతి, కాంచన, హైమావతి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి సహకరించాలి



మాట్లాడుతున్న సామరంగారెడ్డి

గచ్చిబౌలి: బీజేపీ సంస్థాగత పర్వంలో అందరూ ముఖ్య భూమిక పోషించాలని బీజేపీ రంగారెడ్డి అర్బన్‌ జిల్లా అధ్యక్షుడు సామరంగారెడ్డి సూచించారు. శేరిలింగంపల్లి డివిజన్‌ మసీదు బండలో శనివారం నిర్వహించిన బీజేపీ రంగారెడ్డి అర్బన్‌ జిల్లా కార్యశాలలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజాస్వామ్యబద్ధంగా పార్టీ అంతర్గత వ్యవహారాలను నడిపించడానికి బూత్‌స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు బీజేపీ ఎన్నికల కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతోందన్నారు. సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేయడానికి అందరూ సహకరించాలన్నారు. బీజేపీ పార్టీ అధినాయకత్వం ఆదేశాలను అందరూ పాటించాలని సూచించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్‌ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యబద్ధంగా పార్టీని అన్ని స్థాయిలలో ఎన్నికల ద్వారానే ఏర్పాటు చేసుకోవడం జరుగుతుందన్నారు.

ఘనంగా 'అయ్యప్ప ఏకశిలా పదునెట్టాంబడి' పూజామహోత్సవం



పూజ చేస్తున్న సౌభాగ్యానందనాథ ప్రసాదరావు గురుస్వామి

చందానగర్‌: కార్తీకమాసం పురస్కరించుకొని చందానగర్‌ గంగారంలోని జగద్రక్షక ధర్మశాస్త్రా అయ్యప్ప స్వామి ఆలయంలో శనివారం సాయంత్రం అయ్యప్ప స్వామి ఏకశిలా పదునెట్టాంబడి పూజామహోత్సవం సౌభాగ్యానందనాథ ప్రసాదరావు గురుస్వామి ఆధ్వర్యంలో కనుల పండుగగా జరిగింది. భారీగా తరలివచ్చిన అయ్యప్ప స్వాములు, వివిధ కాలనీవాసులు, భక్తులు పడి పూజను తిలకించారు. అయ్యప్ప స్వామి శరణ ఘోషతో ఆలయ ప్రాంగణం మారుమ్రోగింది. భజనమండలి సభ్యులచే భక్తి పాటలు అందరిని ఆకట్టుకున్నాయి. అనంతరం అల్పాహారం వితరణ నిర్వహించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

గచ్చిబౌలి: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన రాయదుర్గం పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్‌ వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం.. రాయదుర్గం మల్కంచెరువు బీబీపాండ్‌లో మృతదేహం ఉన్నట్లు శనివారం సాయంత్రం స్థానికులు రాయదుర్గం పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని(35-40 ఏళ్లు) స్వాధీనం చేసుకున్నారు. ఈ సమయంలో అతను టవల్‌ చుట్టుకున్నాడు, అతని ఒంటిపై గాయాలు ఉన్నాయని పోలీసులు తెలిపారు. అనంతరం ఈ మృతదేహాన్ని శవపరీక్ష కోసం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ వ్యక్తికి సంబంధించిన వారు వెంటనే 9490617191లో సమాచారాన్ని అందించాలని లేనట్లయితే రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌లో స్వయంగా వచ్చి అందించాలని ఆయన కోరారు.

పశువులకు టీకాలు తప్పనిసరి

పశుసంవర్ధకశాఖ ఏడీ అరుణశ్రీ

జిన్నారం(పటాన్‌చెరు): రైతులు తప్పనిసరిగా పశువులకు టీకాలు వేయించాలని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ అరుణశ్రీ సూచించారు. ఉమ్మడి జిన్నారం మండలంలో శనివారం అరుణశ్రీ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మండలంలోని అన్నారం, వావిలాల గ్రామాల్లో టీకాలు వేసిన పశువులను, వాటి చెవులకు అమర్చిన ట్యాగ్‌లను ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ...తనిఖీల వివరాలను భారత పశుధాన్‌ యాప్‌లో అప్‌లోడ్‌ చేశామన్నారు. గాలికుంటు వ్యాధితో జరిగే ప్రమాదాలు రైతులకు క్షుణ్ణంగా వివరించారు. ఈ వ్యాధి సోకితే రైతులకు తీవ్ర ఆర్థికనష్టం జరుగుతుందని, తప్పనిసరిగా రైతులు తమ పశువులకు టీకాలు వేయించాలని సూచించారు. గాలికుంటు వ్యాధి నివారణ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకే ఈ కార్యక్రమాన్ని పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో విడతలవారీగా చేపడుతున్నట్లు తెలిపారు. టీకాలు వేసేముందు తర్వాత సీరం నమూనా అధ్యయనం చేస్తారని వివరించారు. జిల్లా పశుసంవర్ధకశాఖ వైద్యురాలు వసంత కుమారి, ఏడీ పవన్‌ కుమార్‌, పశు వైద్యాధికారులు అరుణ, విశ్వ చైతన్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ఆల్విన్‌కాలనీ: డివిజన్‌ పరిధిలోని వివిధ సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నానని కార్పొరేటర్‌ నార్నె శ్రీనివాసరావు అన్నారు. హైదర్‌నగర్‌ డివిజన్‌ పరిధిలోని జై భారత్‌నగర్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై శనివారం జీహెచ్‌ఎంసీ అధికారులు, కాలనీ వాసులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నామన్నారు. కాలనీ వాసులు అభివృద్ధిలో భాగస్వాములవ్వాలని కోరారు. ఆదర్శవంతమైన కాలనీగా తీర్చిదిద్దుతామన్నారు. ఏ చిన్న సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా కృషి చేస్తామన్నారు. అధికారులు ఏఈ రాజీవ్‌, వర్క్‌ ఇన్‌స్పెక్టర్‌ మహదేవ్‌, కాలనీ వాసులు కుమారస్వామి, మహేష్‌, ప్రభాకర్‌ రావు, సాంబశివరావు, సురేష్‌, వెంకటేష్‌, శ్రీనివాసరావు, కృష్ణారావు, నర్సయ్య, రాఘవేంద్రరావు పాల్గొన్నారు.